www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 8 మే 2025

5

తిరుపతి



జాతరలో బైరాగి వేషధారుల సందడి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి, శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతర ప్రారంభమైంది. ఈ జాతరలో బైరాగి వేషంలో భక్తులు గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. రోజుకో వేషంలో భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. జాతరలో భాగంగా మొదటిరోజు బుధవారం భక్తులు బైరాగివేషంలో అమ్మవారిని దర్శించుకున్నారు. శరీరం మొత్తం నాముకొమ్ము పూసుకుని, మొఖానికి నల్లని బొట్లు పెట్టుకుని, జాతర కాయలను మాలగా ధరించి, వేపమండలను చేతపట్టుకుని, ఆలయం చుట్టూ, ప్రదక్షిణలు చేశారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో కమిషనర్ మౌర్య ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కెఎస్ఎస్‌లో ఉన్నవారికే పదవులు

- రెండు రోజుల పర్యటన నిమిత్త జిల్లాకు విచ్చేసిన మంత్రి
- ఇకపై కెఎస్ఎస్‌లో ఉన్నవారికే నామినేటెడ్, పార్టీ పదవులు
- సామాన్యులను అసామాన్యులుగా మార్చిన పార్టీ టిడిపి
- సైన్యానికి అందరూ అండగా నిలుద్దాం : నారా లోకేష్

ప్రజాశక్తి- సత్యవేడు (తిరుపతి జిల్లా): రాష్ట్రమంతా ప్రధానమంత్రి, భారత సైన్యానికి అండగా నిలబడాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి జిల్లా సత్యవేడులోని విఎంకే కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో నారా లోకేష్ మాట్లాడారు. మనకోసం సరిహద్దుల్లో యుద్ధం చేస్తున్న సైనికులకు సంఘీభావం తెలపాలన్నారు. పాదయాత్రలో సీనియర్లు, జూనియర్లను సమానంగా గౌరవిస్తా, పనిచేసే వారిని ప్రోత్సహిస్తానని హామీ ఇచ్చాను, ఎప్పుడు మీ ప్రాంతానికి వచ్చినా మిమ్మల్నే ముందుగా కలుస్తానని చెప్పా, ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు ఉత్తమ కార్యకర్తలను కలిశానన్నారు. మన పార్టీ కేడర్‌లో ఉన్నవారికి మరో జబ్బు ఉందని దాని పేరు అలక అని ఎద్దేవా చేశారు. సమస్యలు ఏవైనా ఉంటే మనం మాట్లాడుకొని పరిష్కరించుకోవాలన్నారు. నిర్ణయాలు తీసుకునే క్రమంలో కొన్నిసార్లు సమయం పట్టవచ్చు కానీ, కార్యకర్తల మనోభీష్టానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయం తీసుకోమని స్పష్టం చేశారు. ఇకపై పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు రావాలంటే తప్పనిసరిగా కెఎస్ఎస్ బాధ్యులుగా ఉండి తీరాలని, నిజమైన కార్యకర్తలను గుర్తించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, పార్టీ నేతలంతా కమిట్‌మెంట్‌తో పనిచేయాలని సూచించారు. కమిటీలను పకడ్బందీగా నియమించుకొని ముందుకెళదామని కార్యాకర్తలకు పిలుపునిచ్చారు. 14న పోలిట్ బ్యూరోకు ప్రిపేరవుతున్నామని, కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను చర్చిస్తామని తెలిపారు. అలాగే రెడ్ బుక్‌పై ఎవరికీ ఎటువంటి అనుమానం అవసరం లేదని, మాటల్లోకాదు, చేతల్లో చూపుతామని, పార్టీ పిలుపు ఇచ్చిన అన్ని కార్యక్రమాలు సక్రమంగా అమలుచేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నారా లోకేష్

ఎమ్మెల్యే ఆదిమూలం సస్పెన్షన్ ఎత్తివేయాలి టిడిపి కార్యకర్తల నిరసన..

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలుగుదేశం పార్టీ నుండి సస్పెండ్ చేసిన విషయం విదితమే. మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యే అనుచర వర్గం కొందరు స్థానిక పెట్రోల్ బంకు వద్ద ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ నినాదాలు చేశారు. వారు మీడియాతో మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గం పరిశీలకులుగా ఉన్న చంద్రశేఖర్ నాయుడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివద్ధి కార్యక్రమాల్లో తానే అంతా నడిపిస్తూ ఎమ్మెల్యేని పక్కన పెడుతున్నారని చంద్రశేఖర్ నాయుడుపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే వర్గం టీడీపీ కార్యకర్తలు

ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గానికి చెందిన దళిత ఎమ్మెల్యే ఆదిమూలంను అణచివేసే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. ఇలాంటి పోకడలను కొనసాగిస్తే దళితులు ఐక్యంగా పోరాటాలు చేపడతామని, వెంటనే ఎమ్మెల్యే ఆదిమూలం సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

సిపిఎం అగ్రనేతలు ఎంఏ బేబీ, బీవి రాఘవులు రాక

పరిపాలనలో కూటమి ప్రభుత్వం విఫలం : జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

సమావేశాల సందర్భంగా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతిలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతాయని, సమావేశాలకు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరవుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు తెలిపారు. బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో పాతికేళ్ల తర్వాత రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సమావేశాలకు ప్రతి ఒక్క కార్యకర్త హాజరై సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించే విధంగా అడుగులు వేయాలన్నారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్పొరేట్ శక్తులకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోందని ఆరోపించారు. పేదల సమస్యలను అలాగే ఉన్నాయని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం అమరావతి అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. ముఖ్యంగా విభజన హామీలు పూర్తిగా విస్మరించిందన్నారు. వెనకబడిన రాయలసీమ అభివృద్ధికి పైసా నిధులు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా గురించి మాట్లాడకుండా దాటవేయడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చర్యలను ఆపి, ప్రభుత్వం నడిపించాలని కోరారు. ప్రధాన ప్రతిపక్షం వైసీపీ ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం లేదని, సిపిఎం మాత్రమే ప్రజల నిత్యం పోరాటాలు చేస్తోందని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు నియోజకవర్గంలో పేదల ఇళ్లు పూజ చేసిన తర్వాత కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరు బాధ్యతా రహితంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో పేదల సమస్యలు పరిష్కారం కావడం లేదని, దందాలు పెరిగాయని, అవినీతి విచ్చలవిడిగా ఉంటే నియంత్రించడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో కోటి మందిపై కార్మికులు చాలీ చాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని, ధరలు పెరిగి ఇబ్బంది పడుతున్నారని, వారి సమస్యలపై పోరాటం చేపట్టాలని సిపిఎం భావిస్తోందన్నారు. రైతాంగానికి గిట్టుబాటు ధరలు లేక వ్యవసాయం తలకు మించిన భారంగా మారిందన్నారు. వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, ఎదుర్కొంటున్నారని సమస్యలపై సిపిఎం పలు సందర్భాల్లో ఆందోళన చేసామన్నారు.

తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయించాలి

తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు వెచ్చించకూడదని, బిజెపి నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రోజుకు లక్ష మంది తిరుపతికి యాత్రికులు రాకపోకలు సాగిస్తున్నారని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినిందన్నారు. దాన్ని గురించి పట్టించుకోకుండా బిజెపి నేతలు టీటీడీ నిధులు నగర అభివృద్ధికి వాడకూడదని చెప్పడం మంచిది కాదన్నారు. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయించకుండా దేశంలో ఇతర ప్రాంతాల్లో కళ్యాణ మండపాల నిర్మాణం పేరుతో నిధులు మళ్లించడం అన్యాయమన్నారు. తిరుపతిలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడిచే సిమ్స్, బర్డ్, రుయా, మెటర్నటీ ఆసుపత్రికి నిధులు సక్రమంగా కేటాయించడం లేదని, పేదలకు ఉచిత వైద్యం కూడా చేయడం లేదని, పేదలు వైద్యం చేయించుకోవాలంటే లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి పెట్టుకోలేనివాంన్నారన్నారు. గరుడ వారిధి నిర్మాణాన్ని కూడా బిజెపి అడ్డుకోవడం జరిగిందన్నారు. తిరుపతి పారిశుద్ధ్యానికి టిటిడి నిధులు వెచ్చించాలని, దీనికి కూడా బిజెపి అడ్డుకోవడం అన్యాయమన్నారు. తిరుపతి అభివృద్ధికి బిజెపి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని ప్రజలు గమనించాలని కోరారు. కూటమి ప్రభుత్వం బిజెపి చెప్పినట్టు వినడం మంచిది కాదని హితవు పలికారు. గత ప్రభుత్వాలయంలో అంగన్వాడీలు 42 రోజులు పాటు సమ్మె చేశారని, వారి సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదన్నారు. దీంతో పాటు మున్సిపల్ కార్మికులు, విద్యుత్, ఆశ, మధ్యాహ్నం భోజనం, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రానున్న రోజుల్లో సిపిఎం చేపట్టబోయే పోరాటాలకు కలిసి వచ్చే శక్తులను కలుపుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని చెప్పారు.

నేడు ప్రదర్శన, బహిరంగ సభ

సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా ఈనెల ఎనిమిదో తేదీన రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం జరగనుంది. అదే రోజు సాయంత్రం మూడున్నర గంటలకు ఎమ్మెస్ సుబ్బలక్ష్మి విగ్రహం నుంచి భారీ ప్రజా ప్రదర్శన, తర్వాత కచ్చపి ఆడిటోరియంలో సభ నిర్వహిస్తున్నట్లు నేతలు తెలిపారు. ఈ సమావేశాలకు సిపిఎం అగ్ర నేతలు హాజరవుతారు. 8,9,10వ తేదీలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం, పలవల్లి రామకృష్ణారెడ్డి హాల్లో జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు టి సుబ్రమణ్యం, ఎస్ జయచంద్ర, ఆర్ లక్ష్మి, పి.సాయి లక్ష్మి, మాధవ పి.వేణు గోపాల్, రవి పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయండి

ఇంటిగ్రేట్ కమాండ్ కంట్రోల్ పూర్తి చేయాలని అధికారులకు తెలుపుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, స్మార్ట్ సిటీ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షిలతో కలసి సమావేశం నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, చైర్మన్ మాట్లాడుతూ..ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు అన్ని అనుమతులు మంజూరు చేశామన్నారు. అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు సమన్వయం చేసుకుని గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్ర మౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఏఈకాం ప్రతినిధులు బాలాజి, తదితరులు పాల్గొన్నారు

పౌర రక్షణ చర్యలపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: దేశంలో పౌర రక్షణ చర్యలను బలోపేతం చేసేలా కలెక్టర్లు జిల్లాలో ముందస్తుగా భద్రతపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను పోలీసు, రెవెన్యూ, భద్రతా, అత్యవసరసేవా, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం వెలగపూడి నుండి సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ అంశంపై ముఖ్యమంత్రి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా తిరుపతి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డి ఆర్ ఓ నరసింహులు పాల్గొన్నారు. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన సివిల్ డిఫెన్స్ రూల్స్ ప్రకారం జిల్లాలో పౌర రక్షణకై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఆ మేరకు జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, ఫైర్, మెడికల్, మొదలైన ఎమర్జెన్సీ సర్వీసులు, ఇతర అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రత్యేకించి జిల్లాలోని జీజీహెచ్, ఏరియా, జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లతో సమన్వయం చేసుకుని అన్ని రకాల అత్యవసర చికిత్సలు, మందులను, అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచుకోవాలని డిఎంహెచ్‌ఓను ఆదేశించారు. ప్రధానంగా జిల్లాలో ఉన్న విద్యుత్, ఇంధన, అణు ఉత్పాదక సంస్థలు, కర్మాగారాలైన ఆర్టిపిపి, పవర్ గ్రిడ్, ఐఒసీఎల్, హెచ్పిసీఎల్, యూసీఐఎల్ తదితర సంస్థల్లో ఖచ్చితంగా పౌర భద్రతా ముందస్తు చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించాలని జిలా కలెక్టర్ ఆదేశించారు. అలాగే అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు వారి పరిధిలోని మండలాల్లోని సంబంధిత అధికారులతో కలసి పౌర రక్షణ ముందస్తు చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అందులో భాగంగా రిహార్సల్స్, మాక్ డ్రిల్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ప్రయివేటు హోటల్ స్థలం బదలాయింపు

ఒక నిర్ణయం కోసం అత్యవసర భేటీ.. మీడియా బ్రీఫింగ్ రద్దు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల పవిత్రతను కాపాడేందుకు ఏడుకొండలకు ఆనుకొని ఉన్న భూములను ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించరాదని నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో బుధవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఇది వరకే తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలోని సర్వే నెం.604లో ఆంధ్ర ప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ)కు చెందిన 24.68 ఎకరాల భూమిని టీటీడీకి బదలాయించాలని గతంలో టిటిడి బోర్డు నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆ స్థలానికి బదులుగా తిరుపతి అర్బన్ సర్వే నెం.588-ఏ లో ఉన్న టీటీడీకి చెందిన 24.68 ఎకరాల స్థలాన్ని ఏపీటీఏ బదలాయింపునకు టిటిడి బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. అదేవిధంగా తిరుపతి రూరల్ లోని సర్వే నెం.604లోని ఏపీటీఏకు చెందిన మరో 10.32 ఎకరాల స్థలాన్ని టీటీడీకి బదలాయించడం, దానికి బదులుగా తిరుపతి అర్బన్ లోని సర్వే నెంబర్ 588-ఏ లోని టీటీడీకి చెందిన 10.32 ఎకరాల స్థలాన్ని ఏపీటీఏకు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని టిటిడి బోర్డు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవో వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ టూరిజానికి టీటీడీ స్థలమా : భూమన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : అలిపిరి నుంచి 4 కి.మీ దూరంలో ఉన్న, టీటీడీకి చెందిన 31 ఎకరాల భూమిని ఏపి టూరిజంకు బదలాయింపు చాలా ఆశ్చర్యకరణమైన నిర్ణయమని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. పద్మావతి పురంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ పాలకమండలి అత్యవసర సమావేశంలో భక్తులుకు ఉపయోగ పడే నిర్ణయాలు తీసుకుంటారేమో అనుకున్నామని, ఒకే ఒక్క అజెండాతో పాలకమండలి సమావేశం జరిగిందిని తెలిపారు. టీటీడీ స్థలం ఏపీ టూరిజంకు ఇవ్వడానికి తీర్మానం చేశారని తెలిపారు. మాపై ఆరోపణలు చేసిన చంద్రబాబు అలిపిరికి సమీపంలో స్థలం కేటాయించారు. పాదాల మండపానికి చేరువలో టిటిడి స్థలం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడంపై స్వామీజీలు ఉద్యమించాలన్నారు. అలిపిరికి అతి చేరువలో ఉన్న స్థలం టూరిజం శాఖ ఇవ్వడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. వనమూలికలు, ఎర్రచందనం చెట్లు ఉన్న స్థలంలో అరబిందో హాస్పిటల్, క్యాన్సర్ హాస్పిటల్ స్థలం మధ్యలో ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

మహోన్నత వ్యక్తి అల్లూరు : జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశాన్ని, ధర్మాన్ని కాపాడుకునే క్రమంలో సర్వాన్ని త్యాగం చేసిన మహనీయులను గుర్తు చేసుకోవడం భారతీయుల బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రవీంద్ర రెడ్డి, చంద్రశేఖర్, ఆర్.ఐలు రాజశేఖర్ రెడ్డి, రమణ రెడ్డి, రమణ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ

విద్వేషాలు రెచ్చకొట్టే మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తే కఠిన చర్యలు: ఎస్పీ

పాకిస్తాన్ పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో విద్వేషపూరితమైన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా షేర్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏదైనా మెసేజ్ ఫార్వర్డ్ చేసే ముందు అది వాస్తవమైనదా, కాదా నిర్ధారణ చేసుకోవాలన్నారు. అలా కాకుండా మెసేజ్లను ఫార్వర్డ్ చేస్తే గ్రూప్ అడ్మిన్లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు 610 మంది హాజరు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లాలో బుధవారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఈ పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 610 (66.96శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఎస్ తెలిపారు. 301 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు.

అకాల వర్షం.. అపార నష్టం

పిడుగుపాటుకు ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తి రూరల్: పిడుగుపాటుకు గురై ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన మంగళవారం రాత్రి శ్రీకాళహస్తి మండలం ఊరందూరు ఎస్టీ కాలనీలో చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ కథనం మేరకు.. ఊరందూరు ఎస్టీ కాలనీకి చెందిన జె.మురళి (39), అతని సమీప బంధువు ఎన్.శంకర్(36) గ్రామ శివారులో వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి వర్షం ఎక్కువ కావటంతో తిరిగి ఇంటికి వస్తుండగా వారిపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందారు. అయితే వీరిద్దరు అర్ధరాత్రవుతున్నా ఇంటికి రాకపోవటంతో తెల్లవారుజామున కాలనీవాసులు గాలించగా, పంటపొలాలలో మృతి చెంది పడి ఉన్నట్లు గుర్తించారు. కాలనీలో ఇద్దరు మృతి చెందటంతో శోకసంద్రంలో మునిగారు. మృతుడు మురళికి ఇద్దరు కుమారులున్నారు. శంకర్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. మృతుల కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బుధవారం మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

పిడుగు పాటుకు గురై మంగళ వారం రాత్రి చనిపోయిన మృతుల కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. వికృతమాలలో ఎల్లప్ప రెడ్డి, చిందేపల్లిలో ఆంజనేయులు పిడుగుపాటుకు మృతి చెందారు. మృతులకు నివాళులర్పించి, వారి కుటుంబాలకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

గాలివాన బీభత్సం .. రూ.50 లక్షలు నష్టం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యాప్తంగా మంగళవారం రాత్రి కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ శాఖకు 50 లక్షలు రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి పంట పొలాల్లోని విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు నేలకొరిగాయి. చెట్ల చెట్ల కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. బుధవారం సాయంత్రానికి విద్యుత్తు పునరుద్ధరణ పనులు పూర్తిచేసి అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అందించినట్లు అధికారులు తెలిపారు.

నేల రాలిన మామిడి

పుత్తూరు టౌన్: పుత్తూరు గ్రామీణపరిసర ప్రాంతాల్లో గాలి వాన బీభత్సంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మంగళవారం సాయంత్రం ఓ మోస్తారుగా వర్షం కురిసింది. ఈ వర్షానికి తోడుగా పెనుగాలులు వీయడంతో భారీ స్థాయిలో మామిడికాయ నేల రాలాయి. తొర్రూరు, గోపాలకృష్ణాపురం, నేశనూరు, బొజ్జనొత్తం గ్రామాల పరిధిలో అరకొర మామిడి పంటలుండగా, ఈ గాలివానకు అన్ని నేలరాలి పోయాయి. పూత దశ నుంచి మందులు కొట్టి కాపాడుకున్న పంట నేలమయమయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వ ఆదుకోవాలని కోరుతున్నారు.

వెంకటగిరిలో...

వెంకటగిరి టౌన్: వెంకటగిరి మున్సిపాలిటీ పరిధి లోని అనేక ప్రాంతా లలో నిన్న కురిసిన గాలి వాన నగరంలో బీభత్సం సృష్టించింది. కొన్ని ప్రాంతాల్లో వీధులు జలమయమయ్యాయి. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలోని చెట్లు నేలకొరిగాయి. వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ సిబ్బంది పడిపోయిన చెట్టు తొలగించారు. అగ్రికల్చర్ కార్యాలయంలో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. రాణి పేట మెయిన్ రోడ్డులో షాపులకు వేసుకున్న రేకులు కుప్పకూలాయి.

చెరువులను తలపించిన రోడ్లు

పుత్తూరు టౌన్ : వర్షం పడితే రోడ్లపై నిలుస్తున్న నీరు చెరువులను తలపిస్తోంది. పుత్తూరు, జెండా మాను వీధి ఎక్స్టెన్షన్ ప్రాంతంలో రోడ్డుపై వర్షపు నీరు, మురికి నీరు నిండిపోవడంతో వాహనదారులు రాకపోకలకు అవస్తలు పడుతున్నారు. మున్సిపల్ శాఖ నిర్లక్ష్యంమే ఈ దుస్థితికి కారణమని వార్డు ప్రజలు చెబుతున్నారు. డ్రైనేజీ కాలవల్లో చెత్తాచెదారం నిండిపోవడంతో వర్షం పడితే రోడ్డుపై గుంతలాగా ఏర్పడి, ఎక్కడ నీళ్లు అక్కడే నిలిచిపోతున్నాయి. పరిసర ప్రాంతంలో రెండు పాఠశాలలున్నాయి. విద్యార్థులు ఆ నీటిని దాటుకుని పాఠశాలకు వెళ్లాల్సిందే. ఇకనైనా మున్సిపల్ శాఖ అధికారులు స్పందించి వర్షపు నీరు నిలవకుండా, డ్రైనేజీలో చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

శెట్టిపల్లి మార్గం పనులు పునః ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) తిరుపతి–కరకంబాడి మార్గంలో రవాణా శాఖ కూడలి నుండి శెట్టిపల్లి రైల్వే గేట్ వరకు నిర్మించ తలపెట్టిన 80 అడుగుల రోడ్డు మార్గం పనులు సోమవారం పునః ప్రారంభమయ్యాయి. ఈ మార్గంలో ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరడంతో, వాటి స్థానంలో నూతన కల్వర్టులు నిర్మించడానికి గుత్తేదారు రమేష్ నాయుడు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు మార్గానికి ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం నిర్మించడానికి భూమిని చదును చేశారు. పూర్తిస్థాయిలో రోడ్డు మార్గం పనులు వేగవంతం జరగాలంటే ఈ మార్గంలో ఉన్న తెలుగు గంగ నీటి పైపులైను కుడి వైపు ఉన్న రోడ్డు మార్గం నుండి ఎడమవైపు మళ్లించడానికి రూ.2.85 కోట్ల రూపాయలు అవుతుందని, ఇందుకోసం టిటిడి బోర్డు ఈ నిధులు మంజూరు చేయడానికి సంబంధిత [illegible] విభాగానికి బోర్డు సమావేశంలో తీర్మానించనున్నారు. ఈ పైపులైను మార్పు కోసం టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, పనబాక లక్ష్మి, వైద్యం శాంతారామ్‌తో కమిటీ వేశారు. ఈ కమిటీ వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి టిటిడికి నివేదికను సమర్పించనుంది. వర్షాకాలం రాకముందే రోడ్డు నిర్మాణ పనుల్లో వేగం పెంచడానికి గుత్తేదారు చర్యలను తీసుకుంటానని తెలిపారు.

తెలుగు గంగ పైపుకు మరమ్మత్తులు

శెట్టిపల్లి మార్గం నిర్మాణ పనులు పునః ప్రారంభం కావడంతో రేణిగుంటకు సరఫరా అయ్యే తెలుగుగంగ నీటి పైపులైనుకు మరమ్మత్తులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణం తర్వాత నీటి సరఫరాకు అవాంతరాలు ఏర్పడకుండా జాగ్రత్త చర్యలను తీసుకుంటున్నారు. శెట్టిపల్లి మార్గం అందుబాటులోకి వస్తే, ఏదేని నిర్మాణ పనులు సాగించే సమయంలో ప్రత్యామ్నాయ రోడ్డుగా ఈ మార్గం ఉపయోగపడుతుంది. గత వైసిపి హాయంలో అప్పటి టిటిడి బోర్డు చైర్మన్ భుమన కరుణాకర్ రెడ్డి టిటిడి నిధులతో ఈ రోడ్డు మార్గం నిర్మాణానికి రూ.15.16 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించిన విషయం విదితమే.

మూడో రోజు మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద మూడో రోజు మున్సిపల్ కార్మికులు ధర్నా కొనసాగించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ గత సమ్మె కాలపు ఒప్పందాలన్నిటికి వెంటనే జీవోలు జారీ చేయాలన్నారు. కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ముట్టడి చేపట్టడం జరుగుతుందని, ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు వెంకటగిరి మండల ఉపాధ్యక్షులు ఎంఎ రమణ, మున్సిపల్ యూనియన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ పెంచలయ్య, అధ్యక్షులు సుబ్బయ్య, కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, సుబ్బరత్నమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: ఈనెల 8,9,10 తేదీల్లో తిరుపతిలో జరు గనున్న రాష్ట్ర కమిటీ సమావేశాలను జయ ప్రదం చేయాలని, గూడూరులో బుధవారం సి పి.ఎం, సి.ఐ.టి.యు నాయకులు రెండవ పట్టణం పరిధిలోని జక్కా వెంకయ్య శ్రామిక నగర్, మాలవ్య నగర్, కోర్టు సెంటర్, నరసింగరావుపేట, తదితర ప్రాంతాల్లో కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సి.ఐ.టి.యు నాయకులు బి.వి.రమణయ్య, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డిఎల్‌డివో కార్యాలయం సిద్ధం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, తహశీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న డిఎల్‌డివో కార్యాలయాన్ని త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని నెల్లూరు జడ్పీ సిఈవో విద్యా రమ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయంలో ఏమైనా మరమ్మత్తులు ఉంటే వెంటనే చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యాలయం అందుబాటులోకి వస్తే అన్ని పథకాలు ప్రజలకు త్వరితగతిన అందించేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యాలయంలో డిఎల్‌డివోతో పాటు డి.ఎల్.పి.వో, డ్వామా ఏ.పి.డి, 15 మంది సిబ్బంది ఉంటారని తెలిపారు. ఈమె వెంట ఇన్చార్జి డి.ఎల్.డి.ఓ సుస్మిత రెడ్డి, గూడూరు ఎంపిడిఓ మధుసూదన్ రావు, పి.ఆర్. ఏ. ఈ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ దాణా పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: 20 శాతం ప్రోటీన్ కలిగిన 50 కేజీల పశువుల దాణాను ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేసి, పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం పాడిపేట మండలం, కల్లూరు గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు సబ్సిడీ దాణా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పశు వైద్య శాఖ అధికారులు గ్రామ రైతులు చేశారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: తుఫాను, వరదల సమయాల్లో సముద్ర తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా సూచించారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ ఉత్తర్వుల మేరకు, గూడూరు నియోజకవర్గ పరిధిలోని కోట మండలం, గోవిందపల్లి గ్రామంలో గురువారం ఉదయం 8 గంటల నుండి ఎస్.డి.ఆర్.ఎఫ్ సహకారంతో పోలీసులు, పలు శాఖల అధికారుల సమన్వయంతో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని తీర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకొని, విపత్తులు, వరదల సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

భారత ఆర్మీకి జేజేలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, టవర్ క్లాక్ సెంటర్ వద్ద బుధవారం శ్రీ వివేకానంద కోచింగ్ సెంటర్ విద్యార్థులు స్వీట్లు పంచుకుంటూ భారత త్రివిధ దళాలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ కన్వీనర్ మల్లికార్జున మాట్లాడుతూ, బుధవారం తెల్లవారుజామున పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో భారత త్రివిధ దళాలు చేపట్టిన ప్రతీకార దాడిని అభినందించారు. భారత ప్రధానమంత్రి, త్రివిధ దళాల అధిపతులు, విదేశాంగ శాఖకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ ఉపాధ్యాయులు సరిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వైసీపీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని నగరి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్, మాజీ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. నగరి వైసీపీ కార్యాలయంలో మున్సిపాలిటీ అనుబంధ విభాగ అధ్యక్షులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రిని మున్సిపాలిటీ అనుబంధ విభాగ అధ్యక్షులు, నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ప్రజల కోసం అందరూ కలిసి సేవ చేయాలని, పార్టీ కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొని అభివృద్ధికి బాట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, కౌన్సిలర్లు గుణశేఖర్, భానుమతి, రాధా, మోహన్ రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిడిఓగా దిలీప్ కుమార్ నాయక్

ప్రజాశక్తి -కోట: కోట మండలం, స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న వేణు స్థానంలో నూతన ఎంపీడీవోగా దిలీప్ కుమార్ నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన అన్నమయ్య జిల్లా, తంబళ్ళపల్లి లో విపిఓఆర్డీగా పనిచేస్తూ కోట మండలానికి ఎంపీడీవోగా రావడం జరిగింది.

ఇండియన్ ఆర్మీకి వందనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టూరిస్టులను అకారణంగా పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదుల భరతం పట్టేందుకు ఆపరేషన్ సిందూర్ ద్వారా ఆర్మీ జరిపిన సాహసోపేత దాడులకు సెల్యూట్ చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షులు గౌడపేర చిట్టిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదాన్ని తుది ముట్టించడానికి భారత్ చేసే ప్రయత్నంలో భారత ఆర్మీకి భారతీయులందరూ తోడుంటామన్నారు.

అన్నదాన కార్యక్రమం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి శెట్టిపల్లి పంచాయతీ వార్డు సభ్యులు రామ్మూర్తి రెండవ వర్ధంతి సందర్భంగా ఆయన మిత్ర బృందం, ఆర్‌ఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి బాలాజీ బస్టాండ్ వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రమణ యాదవ్, రామ్మూర్తి మిత్ర బృందం విజయ్ యాదవ్, రాజు, చిట్టిబాబు, విజయ్ పాల్గొన్నారు.

త్వరగా పనులు ముగించుకోండి

ప్రజాశక్తి- ఏర్పేడు: జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు సివి శ్రీనివాస్ ప్రసాద్ బుధవారం పంగూరు పంచాయతీ కాట్రకాయలగుంట గ్రామంలో రైతుల పొలాల్లో జరుగుతున్న ఫారంపాండ్స్ పనులను తనిఖీ చేశారు. కూలీలకు 300 రూపాయలు గిట్టుబాటు అయ్యేలాగా పని చేయించాలని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా ఉదయం 6కు మొదలు పెట్టి 11 గంటలలోపు పని ముగించుకోవాలి సూచించారు.

వాటర్ షెడ్ పథకాల అభివృద్ధితో నీటి నిల్వ సామర్థ్యం పెంపు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : వాటర్ షెడ్ అభివృద్ధి పథకాల ద్వారా నీటి సామర్థ్యం నిల్వల పెంపు ఎందరికో జీవనోపాధినిస్తుందని నేలపట్టు వైల్డ్ లైఫ్ ఎఫ్ఆర్ఓ సౌజన్య పేర్కొన్నారు. బుధవారం పక్షుల కేంద్రంలో వాటర్ షెడ్ అభివృద్ధి, జీవనోపాధిపై అవగాహన, ల్యాండ్ స్కేపింగ్ లెవెల్ మేనేజ్మెంట్ కమిటీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె యుఎన్‌డిపి, జి సి ఎఫ్, ఈసిఆర్ఐసి సి, ప్రాజెక్టుల ద్వారా వాటర్ షెడ్ అభివృద్ధి పథకాలు గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రధానంగా వాటర్ షెడ్ సమీప ప్రాంతాల్లో రైతులకు ఉపయోగపడే భూగర్భ జలాల నిల్వల తోపాటు, మత్స్యకారుల జీవనోపాధికి చేపల పెంపకం కూడా చేసుకునే అవకాశాలు ఉంటాయని చర్చించారు. అదేవిధంగా నూతన సాంకేతిక పరమైన వ్యవసాయ పద్ధతులను గురించి, మట్టి నమూనా సారవంత న్యాయల పరీక్షల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఏపీవో ఉషారాణి, ఏపిఎం మునిరాజా, సి సి,ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తరేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలంలో కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తాసిల్దార్ టీవీ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కుటుంబసభ్యుల చేరిక, తీసివేత, చిరునామా మార్పులు వంటివి చేసుకోవచ్చున్నారు. అర్హత లేకుండా రాయితీ పొందుతున్న వారు కార్డులు సరెండర్ చేయాలని సూచించారు.

ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో జానపద జాతర

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలో "మన పల్లె జానపదం జాతర" పేరుతో ప్రపంచ రికార్డు నెలకొల్పడానికి యస్వీయు సెనేట్ హాల్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్ఓ) గుర్తింపు పొందిన "ప్రజా కళావేదిక", డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కార్యక్రమం సాగనుంది. శుక్రవారం ఉదయం 9 గంటలకు జరిగే ప్రారంభసభకు ముఖ్యఅతిథిగా ఎస్.వి యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు హాజరుకానున్నారు. విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడు, గౌరవ అతిథిగా విద్యార్థుల సంక్షేమం, సాంస్కృతిక వ్యవహారాల సంచాలకులు ఆచార్య మురళీధర్ హాజరవుతారు. ఆత్మీయ అతిథిగా ప్రముఖ రచయిత, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పూర్వ సభ్యులు డాక్టర్ వి.ఆర్ రాసాని, ప్రత్యేక అతిథిగా 'ఆకాశవాణి' సహాయ సంచాలకులు సుధాకర్, ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రముఖ సామాజిక కార్యకర్త, కాలమిస్ట్, కేంద్ర ప్రభుత్వ 'రాజ్య మహిళా సమ్మాన్' అవార్డు గ్రహీత డాక్టర్ నల్లాని రాజేశ్వరి పాల్గొంటారు. కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజా కళావేదిక చైర్మన్, కవి, జర్నలిస్ట్ అరవ జయపాల్, ఎస్వీయూ సాంస్కృతిక సమన్వయకర్త డాక్టర్ పత్తిపాటి వివేక్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 300 మంది ప్రతినిధులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు.

ఆర్ఐఓపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, బైరాగిపట్టెడ, బన్సల్ క్లాసెస్ కోచింగ్ సెంటర్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి మాట్లాడుతూ బన్సల్ క్లాసెస్ అనే కోచింగ్ సెంటర్ పేరుతో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇంటర్మీడియట్ కోర్సు నడుపుతున్నారని, అక్రమంగా లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ పేద విద్యార్థుల తల్లితండ్రులను మోసం చేస్తున్నారని, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత సంవత్సరం ఆర్ఐఓ నిర్లక్ష్యంతో 70 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులకు అనేకసార్లు విన్నవించుకున్నా వారు ముడుపులు అందితే చాలనే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆ కోచింగ్ సెంటర్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, లేనియెడల అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆర్ఐఓ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయి కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ఉదయ్ కుమార్, సి.ప్రవీణ్ కుమార్, ఆఫీస్ బేరర్స్ హరికృష్ణ, ఓం రాజు, సాధిక్ బాబు, జగదీష్, రంజిత్, సుబ్బు, విష్ణు, అశోక్‌లు పాల్గొన్నారు.

మా భూములు ఇవ్వం

ప్రజాశక్తి - సత్యవేడు: తమ భూములను పరిశ్రమలకిచ్చి, వారిచ్చే చిరు ఉద్యోగాలతో బతకలేమని శ్రీ సిటీ పరిధిలోని కొల్లడం, ఇరుగుళం, రాళ్ల కుప్పం, పెద్దిటిపాకం గ్రామ రైతులు జాయింట్ కలెక్టర్ శుభంబన్సాల్ ఎదుట తమ ఆవేదను వ్యక్తపరిచారు. ఏపీఐఐసీ రెండో విడత భూ సేకరణ చేపడుతున్న సందర్భంగా గత కొద్ది రోజులుగా బలవంతపు భూసేకరణను ఆపాలని రైతులు నిరసనలు చేపడుతున్న నేపథ్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శ్రీ సిటీ పరిధి గ్రామ రైతులతో ఆర్డీఓ కిరణ్మయి, ఇంచార్జ్ తహశీల్దార్ రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ శుభంబన్సాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ భూములు పరిశ్రమలకిచ్చి, వారిచ్చే చిరు ఉద్యోగాలతో బతకలేమన్నారు. భూములకు పరిహారం చెల్లించడం విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభలు నిర్వహించి, తమ న్యాయ్యమైన డిమాండ్లను అంగీకరించేంతవరకు భూములను అప్పగించేది లేదని స్పష్టం చేశారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరలా వచ్చే మంగళ, బుధవారాలలో సమావేశం నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్ రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు సుశీల్ కుమార్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మహేష్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, అనిల్ కుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ కుంభకోణంపై విచారణ చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వం కుట్టు మిషన్ల పంపిణీ పథకంలో బీసీల నిధులను మళ్లింపు చేసి కుంభకోణం చేసిందని, దీనిపై విచారణ జరపాలని వైసిపి బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు తండ్లం మోహన్ యాదవ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి కుట్టు మిషన్లను పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు, బీసీల అభ్యున్నతికి సంబంధించిన నిధులను దారి మళ్ళించారని ఆరోపించారు. ఈ స్కీంలో తక్కువ అంచనాలకు కోట్ చేసిన సరఫరా కంపెనీలను కాదని ఎక్కువ మొత్తంలో కోట్ చేసినవారికి ప్రాధాన్యత ఇచ్చి వారి కుంభకోణానికి తెరతీశారన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఏపీ ఎస్పీడీసీఎల్ ప్రాజెక్టు విభాగపు డైరెక్టర్‌గా పి. అయూబ్ ఖాన్‌ను, టెక్నికల్ విభాగపు డైరెక్టర్‌గా కే. గురవయ్యను నియమిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో బుధవారం ఏపీ ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వారు తమ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ మెరుగైన విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తామన్నారు.

గంగమ్మ జాతర విశిష్టతను విశ్వవ్యాప్తం చేద్దాం



ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తాతయ్య గుంట గంగమ్మ జాతర విశిష్టతను విశ్వవ్యాప్తం చేద్దామని జనసేన పార్టీ నాయకులు బత్తెన మధుబాబు పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జాతర పురస్కరించుకుని దేవతామూర్తుల వేషధారణలో మీడియాతో మాట్లాడారు. తిరుపతి ప్రజలు తిరుమల శ్రీవారు, తిరుపతి గంగమ్మ వలన సుభిక్షంగా ఉన్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో చంద్రావతి, గాయత్రి, క్రాంతి కుమార్, ఉమాశంకర్, చందన, జయంతి, రాధా, అంబిక, పార్థు తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీల్లో నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో ప్రైవేటు లాడ్జీలు నడుపుతున్న యాజమాన్యాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి సూచించారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం లాడ్జీల నిర్వాహకులతో పోలీసు అధికారులు సమావేశం నిర్వహించారు. రిసెప్షన్‌లో గదులు, వాటి ధరల పట్టికను ఏర్పాటు చేయాలని తెలిపారు. బసకు దిగే వ్యక్తుల వివరాలను ఆధార్‌తో సహా నమోదు చేయాలని సూచించారు. యాత్రికులను మభ్యపరిచి వారి నుంచి అధిక వసూళ్లకు పాల్పడరాదన్నారు. అనుమానత వ్యక్తుల వివరాలను పోలీసులకు అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో సిఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మను దర్శించుకున్న వైసీపీ నేత కామిరెడ్డి రాజారెడ్డి



ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా, నాయుడుపేటలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామదేవత శ్రీ పోలేరమ్మ జాతర మహోత్సవంలో అన్ని పార్టీలకు సంబంధించిన పలువురు నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నాలుగు రోజులు పాటు నిర్వహించిన జాతర మహోత్సవం, నాలుగవ రోజైన బుధవారం నాయుడుపేట చుట్టుపక్కల నుంచి వేలాదిమంది ప్రజలు అమ్మవారిని దర్శించుకుని తరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారి నిమజ్జనం కార్యక్రమంతో జాతర ముగిసింది. ఈ క్రమంలో బుధవారం వైసీపీ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

18 నుంచి సిపిఎల్ -1

11న ఆడిషన్స్ : సీడీసీఏ అధ్యక్షులు విజయకుమార్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్), ఆంధ్ర క్రికెట్ లీగ్ (ఏసిఎల్) తరహాలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చిత్తూర్ డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ (సిడిసిఏ) ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి చిత్తూరు ప్రైమరీ లీగ్ (సిపిఎల్–1) నిర్వహించినట్లు ఆ సంఘం అధ్యక్షులు విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) తెలిపారు. తిరుపతిలోని ఆయన నివాసం వద్ద బుధవారం విలేకరులతో మాట్లాడుతూ క్రికెట్ ప్రేక్షకులను ఉత్సాహపరుస్తున్న ఐపిఎల్‌లో ఎలాగైనా ఆడాలని ప్రతి క్రీడాకారుడు కోరుకుంటారన్నారు. ఐపిఎల్‌లో సత్తా చాటితే భారత జట్టులోకి ఎంపికవడం ఖాయమని తెలిపారు. అందుకోసం ప్రతి ఒక్కరు ప్రయత్నిస్తూ ఉంటారని, కానీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులకు అవకాశాలు తక్కువని తెలిపారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాల్లో టర్ఫ్ పిచ్‌లు లేవు, ఈ కారణంతో క్రీడాకారులకు పెద్దగా అవకాశాలు రాకుండా పోతున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పెద్దలను సంప్రదించి, జిల్లాలో టర్ఫ్ పిచ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కింద స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, సిపిఎల్ -1 నిర్వహించాలని జిల్లా క్రియేట్ అసోసియేషన్ నిర్ణయించిందన్నారు. దీనికి సంబంధించిన స్పాన్సర్లను కూడా ఇప్పటికే సిద్ధం చేశామని, ఈ నెల 18వ తేదీ నుంచి ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో సిపిఎల్ టోర్నీ నిర్వహిస్తామని తెలిపారు. 17 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు గల క్రీడాకారులు ఇందులో పాల్గొనవచ్చని తెలిపారు. ఇందుకు అయిదు టీములను ఏర్పాటు చేస్తామని, మ్యాచ్ లన్ని లైవ్ ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు అర్హులైన క్రీడాకారులను ఈనెల 11న ఆడిషన్స్ నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. లీలామహల్ సమీపంలోని కీస్ విహాస్ హోటల్లో ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు ఆడిషన్స్ జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని, పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. అనంతరం రంజీ ట్రోఫీ క్రీడాకారులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సిపిఎల్ నిర్వహించడం సంతోషదాయకమన్నారు. దీన్ని ప్రతిక్రీడాకారుడు సద్వినియోగం చేసుకొని, సిపిఎల్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ నాయకులు గిరిబాబు, శ్రీనివాసమూర్తి, హరి, సతీష్ యాదవ్, శ్రీధర్ కుమార్, శివ, బివి రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

ప్రజాశక్తి - తిరుపతి. టౌన్: గంగమ్మ ఆలయ పరిసరాల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గంగ జాతర సందర్భంగా ఆలయంలో కల్పించిన ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ భక్తులతో మాట్లాడి వారికి కావాల్సిన సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. క్యూ లైన్ల వద్ద భక్తుల మధ్య తోపులాట జరగకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, ఆలయ ఈ.ఓ. జయకుమార్, ఏసీపీ బాలాజీ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ రాజు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, తదితరులు ఉన్నారు.

యుటిఎఫ్ కార్యకర్తలు మార్గదర్శకులుగా ఉండాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ – యుటిఎఫ్‌లో నాయకులుగా ఎదుగుతున్న కార్యకర్తలు ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉంటూ, వారి వృత్తిపరమైన, సర్వీసు పరమైన విషయాలపై అవగాహన కలిగి ఉండాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాస రావు పేర్కొన్నారు. బుధవారం తిరుపతి యుటిఎఫ్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షులు జి. జే. రాజశేఖర్ అధ్యక్షతన జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న పరిణామాలను పరిశీలిస్తూ విద్యారంగాన్ని సరైనదారిలో నడిపించడానికి యూటీఎఫ్ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే విధంగా బోధన సాగాలని, అందుకు యుటిఎఫ్ కార్యకర్తలు శిక్షణ తీసుకుంటూ సిద్ధం కావాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.జే రాజశేఖర్, ముత్యాల రెడ్డిలు మాట్లాడుతూ తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న యుటిఎఫ్ కార్యకర్తలను సామాజిక స్పృహ కలిగిన కార్యకర్తలుగా మలచడానికి శిక్షణను నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా గౌరవ అధ్యక్షులు రామచంద్రయ్య, జిల్లా సహాధ్యక్షులు కుమారస్వామి, గీతమ్మ, కోశాధికారి మోహన్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్లు, ఆడిట్ కమిటీ సభ్యులు, మండలాలనుండి వచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు.

విప్లవ జ్యోతికి ఘన నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: అల్లూరి సీతారామరాజు నూట ఒకటవ వర్ధంతి సందర్భంగా పుత్తూరులోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి స్థానిక క్షత్రియ రాజులు పాలాభిషేకం నిర్వహించి, గజమాలతో పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రాజు, అఖిల భారతీయ క్షత్రియ మహాసభ అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్ రాజు కోనేటి రవిరాజులు మాట్లాడుతూ అల్లూరి ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సురేష్ రాజు, రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ అధికార ప్రతినిధి సుకుమార్‌రాజు, తిరుపతి జిల్లా అధ్యక్షులు సుందర కుమార్ రాజు, రిటైర్డ్ ఫైర్ ఆఫీసర్ మాధవరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

మృతి చెందిన తిరుపతన్న

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : గంగమ్మ జాతర సందర్భంగా వేపాకు కోస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం తిరుపతిలో చేసుకుంది. తిరుపతి గంగ జాతరను పురస్కరించుకొని వేషాలు వేసుకుని పొట్ట పోషణకు నెల్లూరు, గాంధీజీ కాలనీకి చెందిన 30 కుటుంబాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాలకు చెందిన పెదాల తిరుపతన్న (20) ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధి, కొరమేను గుంట, పోస్టల్ కాలనీలో బుధవారం ఉదయం మిద్దెపైకి ఎక్కి వేపాకు కోస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కింద పడ్డాడు. గమనించిన తోటి స్నేహితులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ.. కానిస్టేబుల్ మృతి

కానిస్టేబుల్ ఢిల్లీ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట సమీపంలోని కదిరి మంగళం వద్ద, కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో విఆర్ కానిస్టేబుల్ ఢిల్లీ (46) మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు మృతుడు తిరుపతిలో విధులు ముగించుకొని నాగలాపురం గ్రామానికినికి వెళ్లే క్రమంలో, వడమాలపేట మీదుగా వెళ్లడానికి మలుపు తిరుగుతుండగా కారు ఢీకొనింది. కారులోని ప్రయాణీకులు స్థానిక అంజేరమ్మ కనుమలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని తిరిగి వెళుతున్నపుడు ఈ ప్రమాదం జరిగింది. ఆయనను చెంచయ్య కుమారుడిగా గుర్తించారు. ఢిల్లీ నాగలాపురం, వినోబా నగర్‌లో భార్య లావణ్య, ముగ్గురు పిల్లలతో నివాసం ఉంటున్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చేశారు.

117 జీవో రద్దుచేయాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో117 రద్దు చేసి, మూడంచెల విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తొమ్మిది రకాల బడులను ప్రవేశ పెట్టడం గందరగోళంగా ఉందని, ఆదర్శ పాఠశాలల ఏర్పాటు పేరుతో దూరంగా ఉన్న బడులను విలీనం చేయటం సమంజసం కాదన్నారు. ఇంతకు మునుపు ఉన్నట్లు 1 నుంచి 5 వరకు ప్రాథమిక పాఠశాల, 1 నుంచి 8 వరకు మాధ్యమిక పాఠశాల, 6 నుంచి 10 వరకు ఉన్నత పాఠశాల, మూడంచల వ్యవస్థను కొనసాగిస్తే ప్రభుత్వ విద్యారంగం బలోపేతమవుతుందన్నారు.

వైసీపీలో చేరిన యాలమూరు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రముఖ వ్యాపారవేత్త సీనియర్ రాజకీయ నాయకులు, యాలమూరు శ్రీనివాసులు రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి సమక్షంలో బుధవారం వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వంలో తిరుపతిలో అభివృద్ధి మాయం అయ్యిందని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందడం లేదని, తిరుపతిని ముందుకు తీసుకెళ్లగల నమ్మకమైన నాయకత్వం భూమన కుటుంబంతోనే సాధ్యమన్నారు. వైఎస్ జగన్ నాయకత్వంలో తిరుపతి అభివృద్ధి పథంలో ముందుకు సాగనుందని తెలిపారు.

ఆలయానికి టీవీ బహూకరణ

ప్రజాశక్తి-ఏర్పేడు: గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయానికి సోనోవిజన్ టీవీ షోరూమ్ అధినేత భాస్కర్ మూర్తి 55 ఇంచుల ఫోర్ కె ఎల్ఈడి టీవీని బహుకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మాజీ చైర్మన్ బత్తలగిరి నాయుడు, కార్య నిర్వహణ అధికారి రామచంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

అల్లూరికి నివాళి

ప్రజాశక్తి - క్యాంపస్ : అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా తిరుపతి, రుద్రరాజు సంపూర్ణమ్మ గార్డెన్స్‌లో రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఆర్ హెచ్ విఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండ్రాజు సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సత్యవేడు నియోజకవర్గ పర్యటన నిమిత్తం విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌ను బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో నగరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి -ఏర్పేడు: అంజిమేడు గ్రామ సచివాలయంలో కిశోర బాలికలకు రేణిగుంట స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణ మంజరి అధ్యక్షతన బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడి పరిధిలోని కిశోర బాలికలకు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, సంపూర్ణ ఆరోగ్యం తదితర అంశాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ భారతి, ప్రగతి ఇబ్బంది మురుగయ్య, వెంకటేష్, అంగన్వాడి టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

గంగమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి - రామచంద్రపురం: చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండలం గ్రామాలలో నిర్వహించిన గంగ జాతర సందర్భంగా గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, దొడ్ల కరుణాకర్ రెడ్డి, బిరుదాల భాస్కర్ రెడ్డి, ఆవిలాల సుధాకర్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతి నార్త్ సెక్షన్, 33/11 కె.వి. ద్వారక నగర్ ఫీడర్ నిర్వహణకు గురువారం ఉదయం 08.00 నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపి.ఎస్పి. డి.సీయాల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈ.ఈ. విన్నకోటిచంద్ర శేఖర్ రావ్ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎన్.జి. ఓ కాలని, రామచంద్ర నగర్, ద్వారక నగర్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్లప్ప రెడ్డి మృతి తీరని లోటు

ప్రజాశక్తి-ఏర్పేడు: వికృతమాలలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు పి.ఎల్లప్ప రెడ్డి (60) మంగళవారం సాయంత్రం పొలం నుండి ఇంటికి వెళుతున్న క్రమంలో ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో పక్కనే ఉన్న కోళ్ల ఫారం వద్దకు చేరుకోగా గోడ కూలి మృతి చెందారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి శ్రీవాణి రెడ్డి, సిపాయి సుబ్రహ్మణ్యం, మండల వైసిపి నాయకులు ఆయన పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు.

నారా లోకేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - రేణిగుంట: తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కి ఘన స్వాగతం లభించింది. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్, ఎస్పీ హర్ష వర్ధన్ రాజు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రోడ్డు మార్గాన సత్యవేడుకు బయల్దేరి వెళ్లారు.